## సామూహిక కుంకుమార్చన



యాకుత్‌పురా: హరిబౌలీలోని గజానన వ్యాయామశాల మాత్తేశ్వరీ పోచమ్మ, మహంకాళీ ఆలయంలో మంగళవారం అమ్మవారికి నాలుగో వారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం వంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన ప్రతినిధి కెడాల దినేష్, సభ్యులు ప్రభునాథ్, సుశీల్, శ్రావణ్, గోపాల్ యాదవ్, అజయ్, శ్రీధర్, రవీందర్, ప్రభునాథ్, ప్రకాష్, విఠల్ రావు, సాయితేజ, శ్రీనివాస్, అభినవ్, వేద్‌సాయి, మన్మోహన్, అర్చకులు రంగనాథ్ పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లికి ఆహ్వానం



మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన ఇండియన్ అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో జరిగే బతుకమ్మ సంబరాలకు హాజరు కావాలని స్విట్జర్లాండ్ ఇండియన్ అసోసియేషన్ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులు జూపల్లిని రవీంద్రభారతిలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ సంప్రదాయ కళలను విశ్వవ్యాప్తం చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ కార్యదర్శి వేదాంతం కిరణ్, కార్యవర్గ సభ్యులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తొట్టెల నిమజ్జనం



ఊరేగింపులో గోల్కొండ ఆలయ పనివృత్తి వార్ల అధ్యక్షులు టి శివశంకర్


లంగర్‌హౌస్: తొట్టెలల నిమజ్జన కార్యక్రమం వైభవంగా ముగిశాయి. బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు సమర్పించిన తొట్టెలలను నగర శివారుల త్రివేణి సంగంలో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. సోమవారం రాత్రి ఆటపాటలతో లంగర్‌హౌస్ త్రివేణి సంగంలో తొట్టెలలను నిమజ్జనం చేశారు. ఈ పూజల్లో గోల్కొండ జగదాంబిక ఆలయ చైర్మన్ చంటిబాబు, టి.శివశంకర్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, వసంత్‌రెడ్డి, డి.శ్రీకాంత్, బోగి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు. గుండు పోచమ్మ వద్ద తొట్టెలలకు చివరి పూజలు నిర్వహించి త్రివేణి సంగంలో నిమజ్జనం చేశారు.

## 'ప్లాస్టిక్ ప్యాడ్'లు హానికరం




అబిడ్స్: రుతుక్రమ సమయంలో ప్లాస్టిక్ ప్యాడ్‌లను మహిళలు వాడడం ద్వారా భూమిని పాడు చేయడమే కాకుండా శరీరానికి హాని కలిగిస్తాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత గైనకాలజిస్ట్ డాక్టర్ మంజుల అనగాని పేర్కొన్నారు. రుతుక్రమంపై ఉన్న అపోహలను తొలగించేందుకు మెహిదీపట్నం సెయింటిస్ట్స్ మహిళా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ..ఒకసారి మహిళలు వాడి పడవేసే ప్లాస్టిక్ ప్యాడ్‌లతో సింథటిక్ పదార్థాలు, ఇతర హానికర రసాయనాలు ఉంటాయన్నారు. వీటి వల్ల చర్మంపై దద్దుర్లు, దురద, చికాకు కూడా కలిగిస్తాయన్నారు. విద్యార్థినుల సందేహాలకు డాక్టర్ మంజుల పలు సమాధానాలు చెబుతూ వివరించారు. కార్యక్రమంలో మర్హం, ఎన్జీఓ స్థాపకురాలు డాక్టర్ నబత్ లఖాని తదితరులు పాల్గొన్నారు.

## నేడు గోల్కొండ బోనాల ముగింపు ఉత్సవాలు



చంటిబాబు

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు బుధవారం గోల్కొండ కోటలో నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ కొందేపూడి చంటిబాబు అన్నారు. గురువారం అమ్మవారికి 9వ పూజ చివరి పూజ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం చంటిబాబు మాట్లాడుతూ..గోల్కొండలో మొదటి బోనం, చివరి బోనం, పూజ కూడ ఇక్కడే నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అయితే ఇప్పటివరకు బోనాలు ప్రారంభం మాత్రమే అధికారికంగా నిర్వహించారని, ముగింపు ఉత్సవాలు కూడా అధికారికంగా నిర్వహించాలని మొదటి నుంచి మంత్రులను కోరామన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గోల్కొండ కోట ప్రధాన ద్వారం వద్ద ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

# బోనం 'కళ కళ'!





నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్న కళాకారులు

- ఉత్సవాల్లో హైలెట్‌గా నిలిచిన ప్రదర్శనలు
- ఘటాల ఊరేగింపులోనూ ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- కళాకారులకు ఉపాధితో ఆనందం..

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఎంతో దూర ప్రాంతాల నుంచి ఒకటి రెండు రోజుల ముందుగా వందల సంఖ్యలో పాతబస్తీకి చేరుకున్న కళాకారులు తమ కళానైపుణ్యంతో పాతబస్తీ ప్రజల మనసు దోచారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలకు పాతబస్తీ భక్తులు మంత్ర ముగ్ధులయ్యారు. తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని కళాకారులతో పాటు ప్రైవేట్‌గా ఇతర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు నగరానికి చేరుకుని గత నెల రోజులుగా నగరంలో తిష్ట వేసి కళా ప్రదర్శనలు నిర్వహించారు.

### నగరంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి...

విశాఖపట్నం, తెనాలి, రాజమండ్రి, అమలాపురం, విజయవాడ, మచిలీపట్నంలతో పాటు నగరానికి చెందిన ఉప్పల్, ఫిల్మ్‌నగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. అంతేకాకుండా కేరళ, తమిళనాడుకు చెందిన కళాకారులు సైతం ఈసారి జరిగి ఉత్సవాల్లో పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు.

### సొంత ఊళ్లకు పయనం..

ఎంతో హడావుడిగా ఇక్కడకు చేరుకున్న కళాకారులు..ఉత్సవాలు ముగిసిన వెంటనే అంతే హడావుడిగా తమ సొంతూళ్లకు పయనమయ్యారు. మరి కొంత మంది వెళ్లే ప్రయత్నం చేశారు. ఇందులో కొంత మంది మంగళవారం తమ ప్రాంతాలకు తరలివెళ్లగా..మరి కొంత మంది బుధవారం తెల్లవారుజామున పాతబస్తీ విడిచి తమ సొంతూర్లకు వెళ్లనున్నారు. మంగళవారం కొన్ని ఆలయాల్లో నిర్వహించిన మారు బోనం అనంతరం వారి వారి గమ్యస్థానాలకు తరలివెళ్లారు.

### భక్తులను ఆకట్టుకున్నారు..



కళాకారులు వివిధ ప్రాంతాల నుంచి పాతబస్తీకి చేరుకుని తమ కళా ప్రదర్శనలతో భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపులో కళాకారులు ప్రదర్శించిన వివిధ రకాల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ నృత్య భంగిమల్లో వారు ప్రదర్శించిన హావభావాలు ప్రజలను మంత్ర ముగ్ధులను చేశారు.

– రాకేష్ తివారి, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్

### అభినందనల వెల్లువ..



బోనాల ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసిన కళాకారులకు నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు అభినందనలు తెలియజేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వారం పది రోజుల ముందుగానే ఇక్కడికి చేరుకున్న వీరందరికీ ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నాం. ఉత్సవాల నిర్వాహకులు సైతం కళాకారులకు పూర్తిగా సహకరించారు.

– మామిడి హరికృష్ణ, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్

## ఆషూర్‌ఖానాల వద్ద ఏర్పాట్లు



గోల్కొండ: ఆషూర్‌ఖానాల వద్ద జరిగే సంతాప దినాల కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని సెట్‌విన్ మాజీ చైర్మన్ మీర్ ఇనాయత్ ఆలీ బాక్రీ అన్నారు. మంగళవారం ఆయన రాందేవ్‌గూడ రోడ్డులోని ఆషూర్‌ఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్బలా యుద్ధంలో వీరమరణం పొందిన వారి కోసం ఆషూర్‌ఖానాలలో మజాలిస్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మజాలిస్ అనంతరం సంతాప గీతాల ఆలాపనలు ఉంటాయన్నారు. పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ నాయకులు ఆబిద్, ఇలియాస్ అలీ తదితరులున్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి



ఈటల రాజేందర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: మోదీ పాలనలో దేశం నెంబర్ వన్‌గా రూపుదిద్దుకుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ గుడిమల్కాపూర్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈటల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ ఆయనను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ..తెలంగాణ అభివృద్ధి డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాధాకిషన్ యాదవ్, దేవర వంశీ, లక్ష్మీకాంత్‌సాగర్, గోవింద్‌సాగర్, శ్రీకాంత్‌సాగర్ ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: 2025–26 సంవత్సరానికి ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్)లో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు అర్హతల ధ్రువీకరణ పత్రాలతో తమ దరఖాస్తులను జూలై 24వ తేదీలోపు సిటీ కళాశాలలో అకడమిక్ కో ఆర్డినేటర్ డా.వాసుదేవరెడ్డికి సమర్పించాలని పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్. ఇంటర్వ్యూలు 25న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఖైరతాబాద్‌లో నిర్వహిస్తారని తెలిపారు. అప్లైడ్ న్యూట్రిషన్–01, అరబిక్–01, ఇంగ్లిస్–06, బీబీఏ–03, బీబీఏ(రిటైల్)–02, బీబీఏ(టూరిజం హాస్పిటాలిటీ ఆపరేషన్స్)–01, బీసీఏ–02, బయో టెక్నాలజీ–3, బాటనీ–1, కామర్స్–03, కామర్స్ (ఫైనాన్స్)–01, కామర్స్(బిజినెస్ అనలిటిక్స్)–02, కామర్స్(టాక్సేషన్)–02, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్–08, కంప్యూటర్ సైన్స్ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)–01, డాటా సైన్స్–01, ఎకనామిక్స్–02, హిస్టరీ –02, మేథమేటిక్స్–04, పొలిటికల్ సైన్స్–02, స్టాటిస్టిక్స్–02, పబ్లిక్ పాలసీ–01, పోస్టులకు గాను పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని, పీహెచ్‌డీ, ఎం.ఫిల్, నెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతోపాటు బోధనానుభావం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఇతర వివరాల కోసం డాక్టర్ వాసుదేవ రెడ్డి (9440136451)ని సంప్రదించాలని తెలిపారు.

## మాదిగ అమరవీరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం



నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమరవీరుల కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం అబిడ్స్ మురళీధర్‌బాగ్‌లోని మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అమరులైన పొన్నాల సురేందర్ మాదిగ, మహేష్ మాదిగ, దేవేందర్ మాదిగ, ప్రభాకర్ మాదిగ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమకారులను గుర్తించినట్లే వారిని కూడా గుర్తిస్తామని, ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామని హామీనిచ్చారు.

## బోనం సమర్పించిన తహసీల్దార్



లాల్‌దర్వాజా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాల్లో భాగంగా బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది మంగళవారం లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించారు. చార్మినార్ తహసీల్దార్ నిహారిక, బండ్లగూడ డిప్యూటీ తహసీల్దార్ రాధిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శివ కుమార్, మధుసూదన్ రెడ్డి, వీఆర్‌వోలు కృష్ణ గౌడ్, మహేష్ కుమార్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి బోనం సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మారుతీ యాదవ్ వారిని సన్మానించారు.

## ఘనంగా దాశరథి శత జయంతి వేడుకలు



జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్



నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు హరినారాయణ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ ప్రజా కవి శాంతి విప్లవ చైతన్య ధార దాశరథి అని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ మాసన చెన్నప్ప అన్నారు. మంగళవారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో దాశరథి శత జయంతి ముగింపు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మాసన చెన్నప్ప హాజరై దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దాశరథి ప్రాచీన పద్యానికి ఆధునిక అభ్యుదయ భావాలను రంగరించి తెలంగాణ ఖ్యాతిని అజరామరం చేశారన్నారు. విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ లోకపావని, తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ మారోజు దేవేంద్ర, డాక్టర్ గడ్డం మోహన్‌రావు, డాక్టర్ హంసమ్మ, డాక్టర్ జ్యోతి, పద్మ, పద్మజ, అరవింద పాల్గొన్నారు.

**శాలిబండలో..**

గౌలిపురా: నిజాం నిరంకుశ పాలనపై కవితాగ్ని ధారను కురిపించిన కవి దాశరథి కృష్ణమాచార్యులని శాలిబండ ప్రభుత్వం బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినారాయణ అన్నారు. మంగళవారం శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎస్.విజయభాస్కర్, మధుసూదన్ రావు, అంజలి, మంజుల, ప్రమీల, రవికాంత్, శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆరెకటిక కులస్తుల సంక్షేమానికి కృషి

అబిడ్స్: ఆరెకటిక కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలంగాణ ఆరెకటిక సమాజ్ గోషామహల్ డివిజన్ అధ్యక్షుడు డి.గోపాల్‌జీ, కార్యదర్శి రాజేష్‌జీ, కోశాధికారి బిచ్‌కుంద భజరంగ్‌జీ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గ కమిటీగా ఎన్నికైన వారిని మంగళవారం పలువురు సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆరెకటిక కులస్తులను సామాజికంగా, రాజకీయంగా ఇతర రంగాల్లో రాణించే విధంగా తమ నూతన కమిటీ కృషి చేస్తుందన్నారు. ఆరెకటిక సమాజ్ తరపున అర్హులైన వారికి పెన్షన్లు కూడా ఇస్తామన్నారు.



గోపాల్‌జీ, రాజేష్‌జీ, భజరంగ్‌జీని సత్కరిస్తున్న దృశ్యం

## 27న ఫిలక్‌మాత ఆలయంలో బోనాలు



డబీర్‌పురా: ఫర్హత్‌నగర్‌లోని ఫిలక్ మాత ఆలయంలో ఈ నెల 27న బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఇప్పటికే ఆలయం వద్ద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 28న అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

## సమగ్ర విచారణ జరపాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా ఉన్నాయని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మానవ హక్కుల కమిషన్‌కు లేఖ రాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సంగారెడ్డి, మంచిర్యాల వసతి గృహాల్లో చోటుచేసుకున్న ఘటనలపై స్వతంత్ర విచారణ కమిటీ ద్వారా విచారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వసతి గృహాలలో విద్యార్థులు అస్వస్థతకు గురైతే కనీసం అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు.

## డయాలసిస్ పేషెంట్ల కోసం క్రీడా పోటీలు

గోల్కొండ: డయాలసిస్ పేషంట్లు, వారికి సేవలు అందించే టెక్నీషియన్స్‌కు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించడం మంచి విషయమని మాజీ క్రికెటర్ సయ్యద్ కిర్మాణీ అన్నారు. మంగళవారం నానల్‌నగర్ డివిజన్ సాలర్‌జంగ్ కాలనీలోని సాఫ్ మెడికల్ సెంటర్‌లో డయాలసీస్ ప్రీమియర్ లీగ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సాఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ..తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఈ టోర్నీలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ చేసుకునే వారు పాల్గొంటున్నారన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆగస్టు 15న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, స్పూన్ రేస్ లాంటి క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## బాలుడి అదృశ్యం



షేక్ నూర్

గౌలిపురా: బాలుడు అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్ ఇర్ఫాన్ కుమారుడు షేక్ నూర్ (14). ఈ నెల 14న చాయ్ తాగేందుకని ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని తల్లి షబానా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా అమ్మవారి ఘటం నిమజ్జనం

జియాగూడ: ధూలపేట మహంకాళి ఆలయం నుంచి అమ్మవారి ఘటాన్ని సోమవారం పురానాపూల్ మీదుగా సీతలా మాత మందిరంలో ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ధూలపేట మున్నూరు కాపు సంఘం సభ్యులు చిలిమిలా ప్రదీప్‌కుమార్, గోపిశెట్టి ప్రమోద్ కుమార్, కేవల్ సింగ్, సతీష్, మహేశ్ కుమార్, నాగరాజ్, దుర్గేష్, హనుమంత్ రావ్, ఉమేష్ పాల్గొన్నారు.



## కల్తీ కల్లును నిషేధించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆప్ నేతలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో కల్తీ కల్లును నిషేధించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిండి సుధాకర్ కోరారు. మంగళవారం ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో కల్తీ కల్లు బాధితులకు న్యాయం చేయాల ని కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కల్లు లేనప్పటి కీ స్థానిక దుకాణాల్లో మాత్రం గణనీయమైన మొత్తంలో కల్తీ కల్లు అమ్ముడవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం జంట నగరాల్లో కల్లు దుకాణాలను నిషేధించి తాటి, ఈత చెట్ల వద్ద కల్లు అమ్మకాలను జరపాలని ఆదేశాలు ఇవ్వగా..కేసీఆర్ ప్రభుత్వం ఆ ఆదేశాలను ఎత్తివేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు ఎంఏ మాజీద్, నర్సింగ్ యమునా గౌడ్, విజయ్ మల్లంగి, దర్శనం రమేష్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసీవుద్దిన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. డివిజన్ పరిధిలోని యాకుత్‌పురా, ఎస్సార్టీ కాలనీ, ఇస్లామియా కాలేజ్, గంగానగర్ నాలా, మౌలాకా చీల్లా, యఖ్రబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన స్థానిక నాయకులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఎస్సార్టీ కాలనీ మన్సూర్ బేకరీ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పాదయాత్ర నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ వసీముద్దీన్, ఏరియా కమిటీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## సన్మానం



గుడిమల్కాపూర్‌లో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న అమర్‌సింగ్

గోల్కొండ: బోనాలకు హైదరాబాద్ నగరం ప్రసిద్ధి అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ అమ్మవారిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ టి.అమర్‌సింగ్ ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు తెలంగాణ ఆడపడుచుల భక్తికి, తెలంగాణ అభివృద్ధికి నిదర్శనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, బీజేపీ నాయకులు దేవరవంశీ తదితరులున్నారు.



## యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్టు

విజయనగర్‌కాలనీ: ఈ నెల 20న ఆసిఫ్‌నగర్‌లో ఓ యువకుడిని హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ కిషన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 20న ఆసిఫ్‌నగర్ న్యూ కిషన్‌నగర్ రహత్ హోటల్ సమీపంలో సోఫాలు తయారుచేసే మహ్మద్ ఖబులా అలియాస్ అడ్డు (28) అతనితో పాత శతృత్వం ఉన్న మహ్మద్ వసీమ్, సమీర్‌ఖాన్ పథకం ప్రకారం కత్తులతో పొడిచి ఆపై కిందపడ్డ బాధితుడిపై గ్రానైట్ రాళ్లు తలపై వేసి చంపి పారిపోయారు. హత్యకు పాల్పడిన మహ్మద్ వసీంకు నేరచరిత్ర ఉందని పోలీసులు తెలిపారు. మంగళవారం సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు ఆసిఫ్‌నగర్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఆసిఫ్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడిపై దాడి

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌పై సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హమీద్ తన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నేతలతో మాట్లాడుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు ముకుమ్మడిగా దూసుకువచ్చి ఆయనపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అంతటి ఆగకుండా కార్యాలయం లోపల ఫర్నిచర్, కాంగ్రెస్ కార్యకర్తల ద్విచక్ర వాహనలను సైతం ధ్వంసం చేశారు. హమీద్ ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.